క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సైదాపురం: మండలంలోని చాగణం రాజుపాళెం పంచాయతీలో శుక్రవారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఎస్‌సీ మండల కన్వీనర్ ఎం రవికుమార్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

చెలికంపాడులో రేపు..

వెంకటగిరిరూరల్: మండలంలోని చెలికంపాడు సచివాలయ పరిధిలో కుర్జాగుంట, మన్నేగుంట, పూలరంగడుపల్లె, అక్బర్‌నివాసకండ్రిగ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని నేదురుమల్లి కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొంది.

రేపటి నుంచి గురుపూర్ణిమ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కే సాయిరామ్‌ప్రసాద్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1, 2 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో తేదీ గురుపూర్ణిమి సందర్భంగా బాబా నగరోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

కానిస్టేబుల్ కేశవులు వర్ధంతి



నివాళులర్పిస్తున్న నేతలు, అధికారులు

కలువాయి: బలిమెల రిజర్వాయర్ ఘటనలో నక్సల్స్ కాల్పుల్లో మృతి చెందిన కలువాయి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు 15వ వర్ధంతి కార్యక్రమం గురువారం అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించారు. తొలుత అనకర్ల కేశవులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌ఐ మహేంద్ర, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ ఓబుల్‌రాజ్, ఆర్ఎంపీ నరసింహులు, సీఆర్పీ నాగేశ్వరరావు, కేశవులు తల్లిదండ్రులు చిన్నయ్య, పెంచలమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథంలో పాండురంగస్వామి

గూడూరు: పాండురంగస్వామి రథోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఊరేగింపు సందర్భంగా గూడూరు పట్టణం పాండురంగస్వామి నామస్మరణలతో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, రథంలో కొలువుదీర్చి వైభవంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి

నాయుడుపేటటౌన్: ఎస్సీ వర్గీకరణ సాధనకు రెండు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో జూలై 10వ తేదీన జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సమితి జాతీయ నాయకుడు జీ శ్రీనివాస్, జిల్లా పర్యవేక్షకుడు కే కొండయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలతో సమావేశం నిర్వహించారు.

ఘనంగా తిరుణాల



అలిమిలిలో ఊరేగుతున్న మాతమ్మ

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని అలిమిలిలో మాతమ్మ తిరుణాళ్ల కొలుపు గురువారం ఘనంగా నిర్వహించారు. ఐదురోజుల పాటు జరిగే ఈ కొలుపు కార్యక్రమంలో అమ్మవారికి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం జరిపారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

మహిళపై అత్యాచార యత్నం

తడ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న వివాహితపై ఆమెకు బంధువైన ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. కాదలూరు గ్రామం, కొత్త దళితవాడకు చెందిన వల్లూరు ప్రవీణ్‌కుమార్(26) అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత(25)పై కన్నేశాడు. ఈ క్రమంలో బుధవారం బాధిత మహిళ భర్త పని నిమిత్తం సూళ్లూరుపేటకు వెళ్లాడు. ఇంటి పని ముగించుకుని రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లోని హాలులో మంచంపై పడుకుని ఉన్న మహిళను గమనించిన నిందితుడు గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి మహిళపై అత్యాచారానికి యత్నించగగా ఆమె కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. ఈ విషయమై బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భక్తికి.. త్యాగానికి ప్రతీక బక్రీద్



గూడూరు:జామియా మసీదులో ముస్లింలతో ఎమ్మెల్యే, బొమిడి తదితరులు



తడ: పూడి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గూడూరు: భక్తికి, త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదులో బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం ఆయన ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు, జిలానీ భాషా, అజీజ్, కబీర్, అల్తాఫ్ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

నాయుడుపేటటౌన్: ముస్లింలు బక్రీద్ పండుగను గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జామీయ మసీదు సమీపంలో షాదిమంజిల్ ఈద్గా వద్ద మౌలానా అబ్బు బకర్ అధ్వర్యంలో ఈదుల్ జుహా ప్రత్యేక నమాజు చేశారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, అందరూ సన్మార్గంలో నడిచి అల్లా కృపాకు పాత్రులు కావలన్నారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుని అలింగనం చేసుకున్నారు. పట్టణంలోని పెద్ద దర్గా వద్ద ఆవరణంలో అమీర్‌షావాలి మసీదు మౌలానా అష్రాఫ్ ఆలీ అధ్వర్యంలో, పాత బస్టాండ్ సమీపంలో నూర్ మసీదు వద్ద అక్కడి హఫీజ్, అమరా గార్డెన్ వద్ద ఉన్న మక్కా మసీదు తదితర చోట్ల మసీదుల్లో ఈదుల్ జుహా నమాజులను నిర్వహించారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

కోట: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు నుంచి శ్యాంసుందరపురం ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని ముస్లింలు ఈదుల్ జుహా(బక్రీద్) పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. సూళ్లూరుపేట, మన్నారుపోలూరు, కోటపోలూరు, కేఆర్పీ ప్రాంతాల నుంచి ముస్లింలు సామూహికంగా మన్నారుపోలూరులోని ఈద్గా వద్ద చేరుకుని ఈదుల్ జుహా నమాజ్‌ను ఆచరించారు. మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగలో బక్రీద్ ఒకటన్నారు. త్యాగానికి ప్రతీక ఈ పండుగా ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఖుర్బానీ ఇచ్చి , చెడు అలవాట్లను దూరం చేసి మంచి మార్గంలో నడవాలన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. వేణుంబాకం, గొల్లపాళెం, డీవీ సత్రం, కల్లూరు తదితర గ్రామాల్లోని మసీదుల్లో భక్తి శ్రద్ధల జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.



రాపూరులో ఈద్గాకు ర్యాలీగా వెళుతున్న ముస్లింలు

ఓజిలిలో..

ఓజిలి:మండలంలోని రాచపాళెం, ఓజిలి, కురుగొండ, ఆర్మేనిపాడు, నెమళ్లపూడి, కర్రబల్లవోలు తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్‌ను జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు పండ్లు, దుస్తులను పంపిణీ చేశారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రాపూరులోని పెద్ద మసీదు వద్ద నుంచి ముస్లింలు ప్రార్థన చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తడలో..

తడ: బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు పూడి గ్రామం వద్ద ఉ న్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఇరుగు, పొరుగు వారికి, స్నేహితులకు స్వీట్లు, బిరియానీ పంచి పెట్టారు.

వాకాడులో..

వాకాడు: బక్రీద్ పండుగ సందర్భంగా మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లు



వెంకటగిరి: లబ్ధిదారుతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి.. సంక్షేమం రెండూ కళ్లలాగా భావించి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారుల బుక్‌లెట్‌లు అందజేసి, పథకాల లబ్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శారద, కౌన్సిలర్లు వహిద, ఎం జానకిరామ్, న్యాయవాది కోటేశ్వరరావు, నాయకులు గణేష్‌రెడ్డి, పేజీరాజ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల పంపిణీ

కలువాయి: దళారులు, మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి మండలం తెలుగురాయపురం సచివాలయం పరిధిలోని కొలవపల్లె, నూకనపల్లె గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు వీ ప్రభావతమ్మ, సర్పంచ్ ఎస్ మౌనిక, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు ఎం వెంకటనరసారెడ్డి, ఎం యజ్ఞపవన్, ఎస్ వెంకటకృష్ణయ్య, ఆర్ దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.



కలువాయి:కొలవపల్లెలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: 'లోకేష్..నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు. నీ జోకర్ మాటలు ప్రజలు నమ్మరు. కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవని నీకు..మంత్రి పదవి కట్టబెట్టారు. అసలు రాజకీయం అంటే ఏంటో తెలుసా. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నావు?.' అంటూ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీకాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మంత్రులను ఎమ్మెల్యేలను ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. మీ నాన్న చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా? అని నిలదీశారు. పచ్చచొక్కాలేసుకున్న నాయకులకు తప్ప, సాధారణ ప్రజలకు టీడీపీ హయాంలో ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. అటు రాష్ట్రంలోనూ, ఇటు నియోజకవర్గంలోనూ జరిగిన అభివృద్ధి కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. అనంతరం పార్టీ పట్టణ, చిల్లకూరు మండల కన్వీనర్లు బొమిడి శ్రీనివాసులు, అన్నంరెడ్డి పరంధామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వంకా రమణయ్య తదితరులు లోకేష్ వాఖ్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లా శ్రీనివాసులరెడ్డి, కోటిరెడ్డి, ఎం సతీష్‌రెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

- వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటన

సాక్షి, తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. తిరుపతి జిల్లా పరిధిలోని 39 మండలాలకు జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించింది. వీరు గ్రామ, వార్డు సచివాలయా ల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గూడూరు నియోజకవర్గం

చిల్లకూరు : వి.మనోజ్‌కుమార్ రెడ్డి
చిట్టమూరు : చేరెడ్డి రాజశేఖర్
కోట : షేక్ మొహిబీన్ బాషా
వాకాడు : ఏనుగు సుధాకర్ నాయుడు
గూడూరు : నూరిబోయిన శ్రీహరి
గూడూరు మున్సిపాలిటీ : కందాటి రాఘవరెడ్డి

సూళ్లూరుపేట నియోజకవర్గం

దొరవారిసత్రం : ఇ.శ్రీనివాసులు రెడ్డి
నాయుడుపేట : వి.కిషోర్
నాయుడుపేట మున్సిపాలిటీ: సీహెచ్.కుమార్
ఓజిలి: ఎస్‌కె. ఖాదర్‌బాషా
పెళ్లకూరు : కె.రఘుబాబు
సూళ్లూరుపేట : ఎం.దేవేంద్రరెడ్డి
సూళ్లూరుపేట మున్సిపాలిటీ : ఐతా శ్రీధర్
తడ : ఆర్‌కె.సుందర్ రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గం

బాలాయపల్లి : తాలూరి వెంకట బంగారుప్రసాద్
డక్కిలి : చింతల శ్రీనివాసులు రెడ్డి
కలువాయి : మాదాసు పవన్
రాపూరు : డి.లక్ష్మీనారాయణ రెడ్డి
సైదాపురం : మన్నారపు రవికుమార్
వెంకటగిరి రూరల్ : ఎం.వెంకటేశ్వర్లు
వెంకటగిరి మున్సిపాలిటీ : పులిప్రసాద్ రెడ్డి

వైఎస్సార్ సీపీ నేతల గృహ నిర్బంధం

గూడూరు: లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు సిద్ధమైన కోడూరు మీరారెడ్డి, సతీష్‌రెడ్డిని గురువారం గృహనిర్బంధం చేశారు. కోటలో జరిగిన యువగళంలో లోకేష్ మాటలను నిరసిస్తూ, అడ్డుకునేందుకు మీరారెడ్డి, సతీష్‌రెడ్డితోపాటు వారి అనుచరులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం అందడంతో అర్బన్ సీఐ హజరత్ బాబు తన సిబ్బందితో కలసి వారిని బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మీరారెడ్డి మాట్లాడుతూ కోటలో జరిగిన లోకేష్ పాదయాత్రలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేతోపాటు, స్థానిక నాయకులపై కూడా లోకేష్ అసత్య ఆరోపణలు చేసి, బురదజల్లేలా మాట్లాడడం దారుణమన్నారు. ఇకనైనా లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు.



మీరారెడ్డి, సతీష్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఐ హజరత్‌బాబు

బాబాకు ప్రత్యేక పూజలు

ఓజిలి: మానమాలలోని సాయిబాబా మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడా హారతి, అభిషేకాలు నిర్వహించారు.ఈ పూజలకు సతీష్, కిరణ్మయి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. 300 మందికి అన్నదానం చేశారు. రాత్రి బాబాకు పల్లకి సేవ నిర్వహించారు.

కనులపండువగా వెంకన్న కల్యాణం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద హోమాలు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం జరిపారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. తిమ్మాజికండ్రిగ సమీపంలో ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామి ఏకాదశి పూజలు చేశారు.

బాబు, పవన్‌లను ప్రజలు నమ్మరు

పెళ్లకూరు: చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ చెప్పే మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం గుర్రప్పతోట, దొడ్లవారిమిట్ట, జీలపాటూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పీ మహేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పీ శేఖర్‌డ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్ ప్రిస్కిల్లా, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, రఘునాయుడు, తిరుపాలయ్య, ప్రసాద్, హరిబాబురెడ్డి, పాండురంగయ్య, వినోద్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పెళ్లకూరు: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటలో మరో రెండు పార్కులు

నాయుడుపేటటౌన్: ప్రజలకు ఆటవిడుపుతో పాటు ఆహ్లాదం కలిగించేలా పట్టణంలోని గాంధీపార్కుతో పాటు మరో రెండు పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలో గాంధీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డితో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా బీఎంఆర్ నగర్‌లో రూ.85 లక్షలు, సీకేఎం తేజ లేఅవుట్‌లో రూ.60 లక్షలతో రెండు పార్కులను ఏర్పాటుకు ప్రతిపాదనలను తుడాకు పంపినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బీ మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, ఒ కిషోర్ యాదవ్, ఏ చంద్రారెడ్డి, రాము, షేక్ రహంతుల్లా, షేక్ షబ్బీర్, ఉన్నారు



గాంధీపార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

విశ్రాంత హెచ్ఎం మృతికి సంతాపం

విశ్రాంత హెచ్ఎం సన్నరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతాపం తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణంలోని శ్రీనివాసులరెడ్డి నివాసం వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'జగనన్న సురక్ష'లో 11 సేవలు ఉచితం



చిల్లకూరు: లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్




సైదాపురం: దేవరవేమూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిల్లకూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నట్లు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. చిల్లకూరు సచివాలయంలో గురువారం సిబ్బంది పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాపై ఆయన ఆగ్రహ వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 4 నుంచి క్యాంపులు ఏర్పాటు చేసే సమయానికి ప్రతి కుటుంబానికి టోకెన్లు అందజేయాలని, అలా చేయని పక్షంలో సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో సర్వే పనితీరును పరిశీలించి లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్య స్వాతి, వీఆర్వో రమణయ్య, కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో గురువారం తురిమెర్ల, దేవరవేమూరు, చాగణం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు వందశాతం సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వసేవలను గుర్తించి ఉచితంగా అందజేస్తామన్నారు.



దొరవారిసత్రం: లబ్ధిదారు బయోమెట్రిక్ తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది

ఏకొల్లులో సర్వే

దొరవారిసత్రం: అధికారులు ఏకొల్లు సచివాలయం పరిధిలోని కుప్పారెడ్డిపాళెం, దొరవారిసత్రం, ఏకొల్లు, పాళెంపాడు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సర్వే చేశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి సైతం గుర్తించారు. జగనన్న సురక్ష కార్యక్రమం తీరును స్థానిక ఎంపీడీఓ సింగయ్య, సర్పంచ్ బ్లెస్సీ పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అవసరమైన సర్టిఫికెట్లతో పాటు సంక్షేమ పథకాలు అందని వారి కూడా గుర్తించి అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామయ్య పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

చిల్లకూరు: మండలంలోని ఏపీఐఐసీకి కేటాయించిన భూములను గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఏపీఐఐసీకి కేటాయించడంతో వారికి భూములు కేటాయించాలని ఇటీవల ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆ కమిటీ సభ్యులు రమణయ్య కోరారు. విచారణ జరిపి, నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆర్డీఓ ఆ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీకి కేటాయించిన భూములను దళితులకు అప్పగించేందుకు ఏపీఐఐసీ అంగీకరించాల్సి ఉందన్నారు. దీనిపై నివేదికలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్యస్వాతి, జెడ్పీటీసీ సభ్యుడు ఎం శీనయ్య, పరంథామరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతవిద్యతోనే మూఢనమ్మకాలు దూరం

గూడూరు: ఉన్నత విద్యతో సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలు దూరం అవుతాయని జేవీవీ నాయకులు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో దాత దశరథ రామిరెడ్డి దాతృత్వంతో జేవీవీ అధ్వర్యంలో బీటెక్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవసరమైన కాలుక్యులేటర్లు, నోటు పుస్తకాలు, పెన్నులు గురువారం అందజేశారు. జేవీవీ నాయకులు మాట్లాడుతూ జేవీవీ ప్రజల్లో దాగున్న మూఢ నమ్మకాలను పారదోలడమేకాకుండా, సామాజిక సేవల్లో, విద్యాభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు వీ రామ్మోహన్‌రావు, పురుషోత్తమరావు, నాగరాజు, శీను, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. తొలి ఏకాదశి వేడుక



పెంచలకోనలో స్వామి హోమం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వాతినక్షత్రం, తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి మాట్లాడుతూ స్వాతినక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో శ్రీవారి మూలమూర్తికి చందనం అలంకరణ, శాంతి హోమం చేసినట్లు చెప్పారు. అలాగే తొలి ఏకాదశి రోజున శ్రీమన్నారాయణుడు యోగనిద్రకు ఉపక్రమించాడని తెలిపారు. తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీవారి కల్యాణమండపంలో నృసింహస్వామి ఉత్సవమూర్తిని పాలసముద్రంలో యోగనిద్రలో ఉన్నట్లుగా విశేషాలంకరణ చేసి, వేద ప్రబంధ గోష, ఆస్థాన సేవ నిర్వహించినట్లు తెలిపారు. శ్రీవారికి 11 రకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

బంగారు గరుడవాహనంపై శ్రీవారు

స్వాతినక్షత్రం సందర్భంగా రాత్రి లక్ష్మీనరసింహ స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువు దీర్చి మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గరుడవాహన సేవ సందర్భంగా భక్తుల గోవిందనామస్మరణలతో కోన మారుమోగింది.



యోగనిద్ర అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



బంగారుగరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు